# వదిన

శ్రీ మురార్జీ

కాంతుడు పెండ్లిపిల్ల మేలిముసుగు తీయగా ఆకాశముమీది చంద్రుడు భూమిమీదకి వచ్చినట్లు తలచాడు. అందమైన మొగముపై నిడుపైన భ్రూకుటీలముల క్రింద సిగ్గులగ్రక్కు నయనములు వాని లోచన గోచరములయ్యెను. నిర్మల ఇంత అందముగా యుండునని అతడు కలలోకూడా తలంచలేదు. సిగ్గు బరువుచే వంగిన కనురెప్పలనెత్తి పతిని చూడగా ఆమె మొగముపై యమాంతము భయపడిన భావము దోపు వెల్లు ప్రసరించెను. మోటు, నలుపురంగు వ్యక్తిని గాంచి ఆమె చిత్తము భయవిహ్వలమయ్యెను. వీరి కొరకేనా తన తండ్రి యెంతో యుపిర్యారి వీరింట యూడిగము చేసినది? వీరికొరకేనా తనతండ్రి యావజ్జీవార్జితము ధారవోసినది ?

కాంతుడీ సంవత్సరము ఎమ్. ఎ. పట్టభద్రుడయ్యెను. ఇన్కంటాక్సు డిపార్టుమెంటులో ఒక మంచి వుద్యోగముకూడా చిక్కెను. ఈ యోగ్యతయే ఒక మంచి కుటుంబమున చురుకుగల అందమైన కన్యకు పెనిమిటిగా ఎన్నుకొనబడుటకు కారణమయ్యెను. బహుసంఖ్యాకులు, కన్యల తండ్రులు ఇంటి చుట్టు తిరిగిరి కానీ నిర్మల అదృష్టమదృష్టము. తండ్రి కృషి ఫలించినది. 15 వేల వరకట్నముచే పెండ్లి నిశ్చయమయ్యెను. ఇంత చురుకైన, యోగ్యుడైన వరునికై 15 వేలును తక్కువే.

'నిర్మలా !'

నిర్మల తన చంద్రుని బోలుమోమును మోకాళ్ళలో దాచికొనినది.

'నాతో మాట్లాడుటకు నీకు భయమా ?'

'లేదు.' ఒక సన్నని రావమామె పెదవులనుండి జారినది.

'నేను నీకు యోగ్యుణ్ణి కాకపోవచ్చును.'

'అట్లుకాదు' అని నిర్మల కాంతుని పాదములపై బడినది. కాంతుడామెనులేపి కౌగలించుకొనెను.

నిర్మల కన్నులు కాంతులు గ్రక్కెను. కాంతుని రూపావలోకనముచే కలిగిన వికలత కాంతుని ప్రేమరసభరిత హృదయలభ్యముచే తొలగ, హృత్కమలముపై యతని మధురవాక్కులు అమృతము చిలికినట్లు గననయ్యెను. వాని ఆమోటు ఆకారములో ఆ నవీన సుందరి హృదయము నాకర్షించుకొను శక్తి కన్పట్టెను. వారిద్దరొకరి నొకరు ప్రేమించుకొనుచు ప్రపంచములో కాంతునికై నిర్మల, నిర్మలకై కాంతుడే బ్రతుకునట్లు దోప మెలగుచుండిరి. ఒక స్వల్పప్రేమలో పెద్ద హృదయమును గెలువగలశక్తి గదాయని నిర్మల ప్రథమమున ప్రప్రథమ సమాగమ రాత్రమున అనుభవమునకు దెచ్చుకొనెను.

కాంతునకు వరంగల్లు బదలీ యయ్యెను. అక్కడ గవర్నమెంటువారు గృహవసతిని గూడా గల్పించి యుండిరి. అందుచే కాంతుడు నిర్మలను కూడా వెంటదీసికొని వెళ్ళెను.

వరంగల్లు ఇద్దరికిని కొత్తప్రదేశము. కాంతుడు అచ్చటి ఆఫీసువాతావరణములో త్వరగ కలిసెను. కాని నిర్మలకు దినముగడచుట దుర్లభముగనుండెను. ఇది గ్రహించి కాంతుడు తన చిన్న తమ్ముడగు హరీశుని రప్పించుకొనెను. హరీశుడు హైదరాబాదులో Inter చదువుచుండెను. వరంగల్లులోనూ 'ఇంటరు' యున్నందువల్ల తోడుగానుండుటయేగాక చదువునకు విఘ్నము కలుగదను తలంపుచే హరీశుని రప్పించుకొనవయ్యెను.

హరీశుడు ఇంటికిరాగానే చిన్నపోయిన ఇల్లు నిండినది. వాని నవ్వు, వాని మాటలు, వాని కవ్వింపు, వానిరూపు నిర్మలకు చాలా నచ్చినవి. ఆమె హరీశునితో చాలా త్వరలో కలసిపోయినది. హరీశునికి గూడా వదినపై చాలా మమకారము.

'వదినే! నీవు చాలా అందగత్తెవుసుమా !'

'మరి నీ కేమన్నా తక్కువా!'

'కాని నీకన్నా తక్కువే.'

'అదెట్లు' అని నిర్మల నవ్వుతూ అడిగినది.

'నిన్నుచూచి వరంగల్లు వారంతా నీ అందానికై చస్తున్నారు.'

'నా అందానికై మా నల్లభామయే చస్తుంది!'

'నల్ల భామ ఎవరు?'

'నా క్లాసుమేటు. మా కాలేజీలోకల్లా అత్యంత కురూపి. అందరూ ఈపేరుతోనే దాన్ని పిలుస్తారు.'

ఇద్దరూ నవ్వారు.

'నల్లపిల్ల ఎప్పుడైనా నీతో ప్రేమమాటలు మాట్లాడుతుందా?'

'ప్రేమమాటలేమిటి? రాగాలాపనలు చేస్తుంది!'

'ఏమని'

'నీవతి సుందరుడవు. నాకు నీపై ప్రేమ, మిక్కిలి ప్రేమ - అత్యంత ప్రేమ - అమితప్రేమ, ప్రేమ! ప్రేమ. నిన్నువదలి నేనుండలేను. బ్రతుకలేను, చావలేను!'

'అప్పుడు నీ వేమంటావు?'

'ఆమె చంపపై ఒక చిన్న పెట్టు పెడతాను.'

'ఎట్లు?'

'ఇట్లు' హరీశుడు వదిన చెంపపై ఒకచిన్న పెట్టు పెట్టెను. వదినె సిగ్గిలినది. హరీశుని అల్లరిపై వదినకు ప్రేమకలిగినది. ఈవిధముగా హరీశుని అల్లరి వదినెకు, వదిన ప్రేమ హరీశునకు ఇష్టమయ్యెను. వారీ విధముగా అమాయకుల రీతి జీవితం గడిపెడివారు.

కాంతునికి గూడా వీరి ప్రవర్తన చాలా నచ్చగా నిర్మలతో నవ్వుతూ ఒకనాడు 'మాడు! మరది యవ్వనుడు సుమా! ఎక్కువ కల్పింప జేసికొనకుము.' అన్నాడు. 'మీరు చాల ఇది' అని నిర్మల అలిగి పోయినది. అలుక పోగొట్టుటకు కాంతునికి గంటలు పట్టెను.

వినీల నిర్మలాకాశము, శీతాకాలము, సూర్యుని లేయెండ శరీరమునకు సెదతీర్చుచుండెను. కాంతుడు ఆఫీసుకు వెళ్ళెను. హరీశుడు కాలేజీకి వెళ్ళెను. నిర్మల పనులెల్ల తీర్చుకొని స్నానముచేసి ఎండలో తల ఆరబోసికొని కూర్చుండెను. శరీరముపై ఒక సన్నని వలువ మాత్రముండెను. ఆమె శరీర కాంతులు సూర్యుని ఆతపమునకు జిగేలు మనుచు బయట పడుచుండెను.

కాలేజి త్వరగా మూసివేశారు. హరీశుడు త్వరగా ఇంటికి వచ్చెను. తలుపు నెమ్మదిగా తట్టెను. ఓరగిలిన తలుపు తెరచుకొనినది. అతను లోనికివచ్చెను. లోపల సావిడిలోకి రాగానే వాని కాళ్ళు వణికినవి. ఎర్రని భుజములపై విరియబోసిన పట్టువలె జిగ జిగ మను వదినె వెంట్రుకలు, చీరనుండి బయటకు దూకు ఆశరీరకాంతులు వానిని పిచ్చివానిగా చేసినవి. అతడా సుందరి యౌవ్వన సౌందర్యమును గ్రోలుచుండెను. శిలా ప్రతిమవలె అటులనే నిల్చిపోయెను. నిర్మల వెనుకకు దిరిగి మరదిని చూచి భయపడినది. సిగ్గుచే ఆమె శరీరము కంపించినది. అమాంతము లేచి గది లోనికి వెళ్ళినది. హరీశుడట్లే నిలిచియుండెను. నిర్మల వలువ మార్చుకొనుచుండెను. హరీశుడు వదిన గదిలోనికి జొచ్చెను. వదిన చీరమార్చి వెంట్రుకల దువ్వుకొనుచుండెను.

'వదిన!'

'హరీశ! ఇంతత్వరగ ఎందుకు వచ్చితివి?'

'నేడు కాలేజి త్వరగా మూశారు.'

నిర్మల స్వరముమారినది. బెదరిన లేడిపిల్లవలె చూపుల జూచుచు

'హరీశుబాబూ!'

'వదినె!'

'నీలో ఏదో మార్పుకనుపిస్తున్నది?'

'ఏమియులేదు. ఏమియులేదు. నేనివ్వాళ్ళ పిచ్చివానినైతిని, నీ అందానికి. నీవింత అందగత్తెవని కలలోను దలంపలేదు సుమీ!'

'నీవు మధువు గ్రోలలేదుకదా!'

'లేదు. నేను సంపూర్ణముగా స్పృహలో నున్నాను. నీలోనున్న సౌందర్యమును జూచుచున్నాను. వదినా! నీవు చాలా సుందరివి!'

హరీశుడు నెమ్మదిగా వదినవైపు వచ్చుచుండెను. నిర్మల భయపడి వెనుకకు జరుగుచుండెను. హరీశుడు ముందునకు వచ్చుచుండెను. హరీశుడమాంతముగా వేగాన్ని హెచ్చించి నిర్మలపై బడబోయెను. నిర్మల తప్పించుకొను నుపాయమునకై దగ్గరనున్న బల్లమీది రాయిని దీసి 'హరీశుబాబూ! నీవక్కడే యుండుము' అనెను. హరీశుడు వినలేదు. ఒక్క క్షణములో రాయి హరీశుని నెత్తిని పగులగొడ్తూ పడెను. వానితలనుండి నెత్తురు కాల్వలై పారెను. అతను స్మృతి దప్పి నేలకొరిగెను.

నిర్మల భయపడినది. ఆమె ఏమిచేసినది? కాని ఆమె ధైర్యమును వీడలేదు. ఏ ధైర్యముతో తన శీలమును కాపాడుకొనుటకై రాతి నెత్తెనో ఆ ధైర్యముతో ఆపరిస్థితి నెదుర్కొనుటకు ముందంజ వేసెను. హరీశుని శిరమునెత్తి తన వడిలో పెట్టుకొనెను. శిరముపై గాయము కడిగి కట్టుకట్టెను. గాయమేమంత పెద్దదిగాదు. కాని వానిమానసిక పరిస్థితి వానినీయవస్థకు దెచ్చినది.

భర్తవచ్చువేళ సమీపించుచుండెను. ఆమె నెత్తురు పడిన ప్రదేశమును శుభ్రపరచెను. ప్రేమపూర్వకముగా హరీశుని తల ఒడిలో పెట్టుకొని విశ్రాంతి కలిగించుటకు నిమురుచుండెను. రక్తప్రవాహము ఆగినందువల్ల మెల్ల మెల్లగా హరీశునకు స్మృతి కలుగుచుండెను. అతను కండ్లు దెరచెను. వానితల నిర్మల యొడిలో నున్నది.

'వదినే! నన్ను క్షమించవూ? నేను పిచ్చివాడనైతిని. నీవు నన్ను యుక్తముగా దండించితివి.' వాని కన్నులు జలమయ మయ్యెను.

'ఎంతపిచ్చివాడవు. పొరపాటెవరిచేగాదు? వదినె మాతృస్వరూపముగదా హరీశుబాబూ!' నిర్మల నయనము లశ్రుజలములచే అంధములయ్యెను.

అప్పుడే కాంతుడు ఆఫీసునుండి తిరిగి వచ్చెను.

'ఏమైనది?! అని వాని మొదటి ప్రశ్న.

హరీశుబాబు లేవబోవ నిర్మల వారించి 'ఏమియు లేదు. జట్కానుండి దిగుచుండగా కాలుజారి తల కొట్టుకొని గాయమైనది.'

'డాక్టరు వచ్చాడా?'

'రాలేదు, నేను కట్టుకట్టాను.'

'డాక్టరు నెందుకు పిలువలేదు?'

'ఎవరిచే పిలిపింతును?' కాంతుడమాంతములేచి డాక్టరును పిలుచుటకై బయటికి వెళ్ళెను.

'వదినె!' అని హరీశుడు నిర్మల కాళ్ళను చేతులతో జుట్టివేసెను. నిర్మల వెక్కి వెక్కి యేడ్చినది.

కాంతుడు నిర్మల హృదయములో దేవపదము నాక్రమించుకొనెను. మరి నిర్మల? నిర్మల హరీశునికి మాతృపదము. కాదు, కాదు, మాతకన్న ఎన్నమిన్న. హరీశుడు చేయినెత్తి చూడగ ఎండిన నెత్తురు మరక కాన్పించెను. దానిలో ఒక స్త్రీ యొక్క నిష్కళంక పవిత్ర చరిత్ర చిత్రించి యుండెను. దానిని అతను తనజీవితములో ప్రప్రథమముగా పరికించెను.

